# ఇండియన్ పాలిటీ

## ప్రాథమిక హక్కులు - స్వేచ్ఛ హక్కు

మానవ చరిత్ర మొత్తాన్ని స్వేచ్ఛ కోసం మనిషి చేసిన పోరాటంగా అభివర్ణించవచ్చు. ఫ్రెంచి, అమెరికన్ విప్లవాలు మానవ స్వేచ్ఛను కాంక్షిస్తూ జరిగిన సంఘటనలే. మానవ విలువల్లో అతి ముఖ్యమైంది స్వేచ్ఛ. ప్రభుత్వ అధిక జోక్యం, పీడన నుంచి వ్యక్తి తరతరాలుగా స్వేచ్ఛను కోరుతూనే ఉన్నాడు. మితిమీరిన స్వేచ్ఛ వల్ల వ్యక్తి ఎక్కడ అసాంఘికంగా తయారవుతాడోనని ప్రభుత్వాలు వ్యక్తిని నియంత్రించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి.

★ టి. హెచ్. గ్రీన్ లాంటి ఆదర్శవాది మాత్రం వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించడానికే రాజ్యం ఏర్పడిందని అభిప్రాయపడ్డాడు. అతడి మాటల్లో 'మానవ వివేచన స్వేచ్ఛను కాంక్షిస్తుంది. స్వేచ్ఛలో హక్కులు అంతర్భాగం. మానవులకు హక్కులు ప్రసాదించేందుకే రాజ్యావిర్భావం జరిగింది'.

★ మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో 19 నుంచి 22వ అధికరణాలు స్వేచ్ఛ హక్కును వివరిస్తున్నాయి.

### 19వ అధికరణం

★ 19వ అధికరణం ఆధారంగా పౌరులు ఆరు రకాల స్వేచ్ఛలను అనుభవిస్తున్నారు.

19 (1) (ఎ): వాక్ స్వాతంత్య్రం - భావ ప్రకటనా స్వేచ్ఛ.

19 (1) (బి): సమావేశమయ్యే స్వేచ్ఛ.

19 (1) (సి): సంఘాలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ.

19 (1) (డి): దేశంలో ఎక్కడైనా సంచరించే స్వేచ్ఛ.

19 (1) (ఇ): దేశంలో ఎక్కడైనా స్థిర నివాసాన్ని ఏర్పరుచుకునే స్వేచ్ఛ.

19 (1) (జి): ఇష్టమైన వృత్తి, వాణిజ్య వ్యాపారాలను అనుసరించే స్వేచ్ఛ.

★ 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 19 (1) (ఎఫ్)ను (ఆస్తిని సంపాదించడానికి, అనుభవించడానికి, అన్యాక్రాంతం చేయడానికి పౌరులకున్న స్వేచ్ఛ) ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు.

★ 19వ అధికరణం కేవలం పౌరులకు మాత్రమే ఉద్దేశించింది.

**19 (1) (ఎ):** ఇది పేర్కొన్న వాక్ స్వాతంత్య్రం, భావ ప్రకటనా స్వేచ్ఛ నిరపేక్షమైనవి (absolute) కావు. కింద తెలిపిన సందర్భాల్లో ప్రభుత్వం వీటిపై హేతుబద్ధమైన నిర్బంధాలను (Reasonable Restrictions) విధించవచ్చు.

✪ దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం వాటిల్లినప్పుడు (16వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పదాలను చేర్చారు.)

✪ దేశ రక్షణ దృష్ట్యా

✪ విదేశాలతో సత్సంబంధాలను నెలకొల్పుకునే క్రమంలో

✪ శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం

✪ సభ్యత, మర్యాదలను కాపాడే నిమిత్తం (Morality & Decency)

✪ న్యాయస్థానాల గౌరవాన్ని కాపాడే క్రమంలో (129, 215 అధికరణాలు తమ గౌరవాన్ని అతిక్రమించే వారిపై సుప్రీంకోర్టు, హైకోర్టులు తీసుకునే అధికారాలను కల్పిస్తున్నాయి - కోర్టు ధిక్కారం)

✪ పరువు నష్టాన్ని నివారించే క్రమంలో

★ పత్రికా స్వేచ్ఛ 19 (1) (ఎ)లో అంతర్భాగమని సుప్రీంకోర్టు పేర్కొంది.

**19 (1) (బి):** ఇది శాంతియుతంగా సమావేశమయ్యే స్వేచ్ఛను అందించింది. అయితే సిక్కు మతస్థులు వారి మతాన్ని అనుసరించి కృపాణాన్ని (చిన్న కత్తిని) ధరించి, శాంతియుతంగా సమావేశం కావచ్చు. ర్యాలీలు నిర్వహించడం, నిరసనలు చేపట్టడం ఈ హక్కులో భాగంగా చెప్పవచ్చు. అయితే ఈ హక్కుపై కూడా దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం హేతుబద్ధమైన

ఆంక్షలు విధించవచ్చు. సమావేశాల వల్ల శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లుతుందని అధికారులు భావిస్తే IPC 144 విధించవచ్చు. అలాగే పరిస్థితి మరీ చేయిదాటేలా ఉంటే కర్ఫ్యూ కూడా విధించవచ్చు.

**19 (1) (సి):** దీని ప్రకారం సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు భారత పౌరులకు ఉంది. దీన్ని ఆధారంగా చేసుకుని నేడు అనేక సంఘాలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు మొదలైనవి. పై రెండు హక్కుల మాదిరిగానే ఈ హక్కును కూడా పౌరులు దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు భంగం కలిగించకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా, నైతిక విలువలు, సభ్యతకు హాని కలిగించకుండా, సంఘాలను ఏర్పాటు చేసుకోవచ్చు. దేశ సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ఎలాంటి సంఘాలనైనా ప్రభుత్వం ఉపేక్షించదు.

**19 (1) (డి):** సామాన్య ప్రజల సంక్షేమం, షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలను అనుసరించి పౌరులు దేశంలో ఎక్కడైనా సంచరించవచ్చు. ఇలాంటి స్వేచ్ఛ వల్ల ప్రజల్లో విశాల భావం, ఐక్యతా భావన పెరిగే అవకాశం ఉంటుంది. అయితే శాంతి భద్రతల దృష్ట్యా కల్లోలాలు చెలరేగే ప్రాంతాల్లో ఇలాంటి హక్కును ప్రభుత్వం రద్దు చేయొచ్చు. ఉదాహరణకు ప్రస్తుతం తీవ్రవాద కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లో, కశ్మీర్‌లోనూ సంచరించే ప్రజలపై పరిమితులున్నాయి.

**19 (1) (ఇ):** భారత పౌరులకు దేశంలో ఏ ప్రాంతంలోనైనా నివాసం ఏర్పరుచుకుని స్థిరపడే హక్కును కల్పిస్తోంది. అయితే ఈ హక్కుపై ప్రజా సంక్షేమం, షెడ్యూల్డ్ ప్రాంతాల ప్రయోజనాల దృష్ట్యా హేతుబద్ధమైన ఆంక్షలున్నాయి. అలాగే 370వ అధికరణాన్ని అనుసరించి జమ్మూ కశ్మీర్‌లో రాష్ట్రేతరులు నివాసం ఏర్పాటు చేసుకునేందుకు వీల్లేదు.

**19 (1) (జి):** దీని ప్రకారం పౌరులు తమకు నచ్చిన వృత్తి, వ్యాపార, వాణిజ్యాలను చేపట్టే స్వేచ్ఛ ఉంది. అయితే ఇక్కడ కూడా ప్రభుత్వం ప్రజా సంక్షేమం దృష్ట్యా హేతుబద్ధమైన ఆంక్షలను విధించవచ్చు. ఉదాహరణకు స్మగ్లింగ్‌ను వృత్తిగా చేపట్టే వీల్లేదు. అలాగే కొన్ని వృత్తులు చేపట్టాలంటే ప్రత్యేక అర్హతలు అవసరం. ఉదాహరణకు వైద్య వృత్తి, న్యాయవాద వృత్తి. దేశ ప్రయోజనం దృష్ట్యా కొన్ని వ్యాపారాలను, పరిశ్రమలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు లేదా జాతీయం చేయొచ్చు. మనది ఒక మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కాబట్టి కొన్ని పరిశ్రమలను ప్రభుత్వం మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. సాధారణ పౌరులకు ఇలాంటి పరిశ్రమలు నిర్వహించే హక్కు ఉండదు. ఉదాహరణకు అణు విద్యుత్ పరిశ్రమ.

★ కొన్ని స్వేచ్ఛలను రాజ్యాంగంలో పేర్కొనక పోయినప్పటికీ 19వ అధికరణాన్ని విస్తృతంగా అర్థం చేసుకునేటప్పుడు అవి అవగతమవుతాయి. ఉదాహరణకు పత్రికా స్వేచ్ఛ, సమ్మె చేసే హక్కు, తెలుసుకునే హక్కు (right to know) మొదలైనవి.

## 20వ అధికరణం

ఈ అధికరణం ప్రకారం చట్టాన్ని అతిక్రమించనిదే ఏ వ్యక్తీ శిక్షార్హుడు కాదు. నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తికి ఈ అధికరణం వల్ల రక్షణ కలుగుతుంది. దీని ప్రాముఖ్యం ఎంత గొప్పదంటే జాతీయ అత్యవసర పరిస్థితుల్లో సైతం ఈ హక్కును రద్దు చేయడానికి వీల్లేదు (44వ రాజ్యాంగ సవరణ).

**ఈ అధికరణం ప్రకారం:**

★ నేరం జరిగిన సమయంలో చట్టరీత్యా అది నేరమై ఉండాలి. (Law in force at the time of commission of offense.)

★ ఒక నేరానికి ఒకేసారి విచారణ, శిక్ష ఉండాలి. ఒకసారి విచారణ జరిగిన తర్వాత తిరిగి అదే నేరాన్ని మరోసారి విచారించకూడదు. (Protection against double Jeopardy.)

★ నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తిని తనకు వ్యతిరేకంగా తనే సాక్ష్యం చెప్పాల్సిందిగా బలవంతం లేదా ఒత్తిడి చేయకూడదు. (Protection against self - incriminating evidence.)

★ ఈ క్లాజ్ IPC Section 179 కి దగ్గరగా ఉంటుంది. ముద్దాయి నేరాన్ని ఒప్పుకుంటూ పోలీసులకిచ్చే వాంగ్మూలం భారతీయ సాక్ష్యాధార చట్టం 27 కింద సాక్ష్యంగా పనికిరాదు. అయితే ఆ వాంగ్మూలం ఆధారంగా నేర పరిశోధనలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తే ఆమేరకు అతడి వాంగ్మూలం సాక్ష్యంగా పనికొస్తుంది. అందుకే ఈ క్లాజును ఆ రెండు చట్టాల్లో పైన ఉదహరించిన సెక్షన్లతో కలిపి అర్థం చేసుకోవాలి.

## 21వ అధికరణం

21వ అధికరణం ప్రకారం చట్టం నిర్ధారించిన పద్ధతి మినహా మరో రకంగా వ్యక్తి ప్రాణానికి లేదా స్వేచ్ఛకు హాని కలిగించకూడదు. ఇది వ్యక్తి ప్రాణానికి, స్వేచ్ఛకు రక్షణ కల్పించే హక్కు. ఈ అధికరణం ఉపయోగించిన పదజాలమైన 'చట్టంచే నిర్ధారించిన పద్ధతి'ని (Procedure established by Law) జపాన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.

★ ఎ.కె.గోపాలన్ Vs మద్రాస్ రాష్ట్రం (1950) వివాదంలో పరిమిత దృక్పథంతో ఈ హక్కు గురించి సుప్రీంకోర్టు అర్థ వివరణ ఇచ్చింది. అయితే 1978లో మేనకా గాంధీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా వివాదంలో కేవలం చట్టం నిర్దేశించిన పద్ధతే కాకుండా, అమెరికాలో అమల్లో ఉన్న శాసన ప్రక్రియ పద్ధతి (Due process of Law) అనే కొత్త సూత్రాన్ని సుప్రీంకోర్టు వెలుగులోకి తీసుకొచ్చింది. 'చట్టంచే నిర్ధారించిన పద్ధతి' అని చెప్పినప్పుడు శాసనసభ (పార్లమెంట్) నిరపేక్షత కనిపిస్తుంది కానీ శాసనసభ ప్రక్రియ పద్ధతి అనే పదజాలాన్ని సుప్రీంకోర్టు వాడటంతో చట్టం చేసే విషయంలో శాసనసభపై కూడా కొన్ని పరిమితులున్నాయని అర్థమవుతుంది.

★ వ్యక్తి స్వేచ్ఛను ప్రసాదించే 19వ, 21వ అధికరణలు రెండూ వేర్వేరు అంశాలు కావని రెండింటిలోని రాజ్యాంగ అంతః సూత్రం ఒకటేనని మేనకా గాంధీ వివాదంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 14, 19, 21 అధికరణాల మధ్య అవినాభావ సంబంధం ఉందని, వ్యక్తి స్వేచ్ఛని సమగ్రంగా అర్థం చేసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. తద్వారా ప్రాథమిక హక్కుల స్థాయి, పరిధిని పెంచినట్లయ్యింది.

★ 21వ అధికరణం జీవించే హక్కును గుర్తిస్తుంది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో సైతం ఈ హక్కును రద్దు చేయకూడదు.

★ కాలానుక్రమంగా 21వ అధికరణానికి సుప్రీంకోర్టు విస్తృత రీతిలో అర్థ వివరణ ఇచ్చింది.

★ జీవించడం అంటే కేవలం జంతువుల్లా అస్థిత్వం కలిగి ఉండటం కాదని, ఖరాక్ సింగ్ Vs ఉత్తర్ ప్రదేశ్ (1965) కేసులో అభిప్రాయపడింది.

★ గోప్యత హక్కును కూడా (Right to privacy) గుర్తించారు (PUCL Vs యూనియన్ ఆఫ్ ఇండియా, 1997).

★ సంకెళ్లను అసాధారణ పరిస్థితుల్లోనే ఉపయోగించాలని (సునీల్ Vs మధ్యప్రదేశ్ రాష్ట్రం, 1990) సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

★ బహిరంగ ఉరి అనేది 21వ అధికరణానికి విరుద్ధమని అటార్నీ జనరల్ Vs Lachman dev వివాదంలో అభిప్రాయపడింది.

★ కేహర్ సింగ్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా వివాదంలో ఉరిశిక్షను తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే విధించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

★ ఆరు నుంచి 14 సంవత్సరాల పిల్లలందరికీ నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యంతో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21 (ఎ) అధికరణను రాజ్యాంగంలో చేర్చారు.

## 22వ అధికరణం

ఈ హక్కు నిగ్రహణ, నిర్బంధం నుంచి పౌరులకు రక్షణ కల్పిస్తుంది. వ్యక్తులను అక్రమ నిర్బంధం నుంచి రక్షించే ఉద్దేశంతో ఈ అధికరణాన్ని చేర్చారు.

★ ఏ వ్యక్తినైనా నిర్బంధంలోకి తీసుకుంటే దానికి కారణమేమిటో ఆ వ్యక్తికి తెలపాలి.

★ వ్యక్తికి తన కేసు తను వాదించుకునే అవకాశం కల్పించాలి లేదా న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే వీలు కల్పించాలి.

★ నిర్బంధించిన వ్యక్తిని 24 గంటల్లోపు సమీప మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి.

★ పై అంశాల్లో చివరి రెండూ కింది పరిస్థితుల్లో లభించవు.

1. నిర్బంధానికి గురైన వ్యక్తి శత్రు దేశానికి చెందిన వ్యక్తి అయినప్పుడు.

2. నివారక నిర్బంధ చట్టం (Preventive Detention Act) కింద అరెస్ట్ అయినప్పుడు.

### నివారక నిర్బంధ చట్టం

నివారక నిర్బంధం అంటే చట్టాన్ని అతిక్రమించకముందే, అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదనే ఉద్దేశంతో అలాంటి పనులకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం. 22వ అధికరణం పార్లమెంటుకు నివారక నిర్బంధ చట్టాన్ని రూపొందించే అవకాశం కల్పిస్తోంది. అయితే

1. ఆ చట్టం అవసరాన్ని, పరిస్థితులను వివరించాలి.

2. వివిధ వర్గాల కేసుల గురించి వివరించాలి.



www.eenadupratibha.net

3. నిర్బంధం గరిష్ఠంగా ఎన్నాళ్లు ఉంటుందో తెలపాలి.

4. సలహా మండలిని ఏర్పాటు చేయాలి.

★ నివారక నిర్బంధ చట్టాన్ని ప్రయోగించే క్రమంలో దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది కాబట్టి కింది షరతులను పాటించాలి.

1. సలహా మండలి సూచనపై తప్పితే నిర్బంధం మూడు నెలలు దాటకూడదు.

2. నిర్బంధించిన వ్యక్తికి ఏ పరిస్థితుల్లో అతన్ని నిర్బంధిస్తోంది తెలపాలి.

## మాదిరి ప్రశ్నలు

**1.** న్యాయస్థానాల ధిక్కారం గురించి తెలుపుతున్న అధికరణాలు ఏవి?

ఎ) 123, 125 బి) 125, 129 సి) 75, 79 డి) 326, 368

**2.** 'చట్టంచే నిర్ధారించిన పద్ధతి'ని ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?

ఎ) అమెరికా బి) ఇంగ్లండ్ సి) కెనడా డి) జపాన్

**3.** శాసన ప్రక్రియ పద్ధతిని ఏ వివాదంలో సుప్రీంకోర్టు గుర్తించింది?

ఎ) మేనకా గాంధీ వివాదం బి) ఎ.కె.గోపాలన్ వివాదం

సి) రమేష్ థాపర్ వివాదం డి) సజ్జన్ సింగ్ వివాదం

**4.** జీవించే హక్కు గురించి తెలియజేసే అధికరణం ఏది?

ఎ) 16వ బి) 21వ సి) 17వ డి) 25వ

**5.** ఏ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యాహక్కును ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చారు?

ఎ) 86వ బి) 73వ సి) 91వ డి) 61వ

**6.** MISA చట్టాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?

ఎ) 1980 బి) 1971 సి) 1984 డి) 1976

**7.** నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తికి సైతం రక్షణ కల్పిస్తున్న అధికరణం ఏది?

ఎ) 19వ బి) 24వ సి) 20వ డి) 26వ

**8.** నేషనల్ సెక్యూరిటీ యాక్ట్‌ను ఎప్పుడు ప్రవేశపెట్టారు?

ఎ) 1980 బి) 1977 సి) 1988 డి) 1985

**9.** ప్రస్తుతం ఉన్న 19వ అధికరణ వల్ల మనం ఎన్ని రకాల స్వాతంత్ర్యాలను పొందగలుగుతున్నాం?

ఎ) 7 బి) 6 సి) 5 డి) 8

**10.** 19 (1) (ఎఫ్)ను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు?

ఎ) 42వ బి) 46వ సి) 44వ డి) 48వ

### జవాబులు

1–బి; 2–డి; 3–ఎ; 4–బి; 5–ఎ; 6–బి; 7–సి; 8–ఎ; 9–బి; 10–సి.

**రచయిత: జి. కళ్యాణ చక్రవర్తి**



www.eenadupratibha.net
www.eenadupratibha.net